క్లుప్తంగా

అంగన్‌వాడీ టీచర్‌కు షోకాజ్ నోటీస్

మహబూబాబాద్: కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని ఓ వైన్స్‌షాప్ పర్మిట్‌రూంలో అంగన్‌వాడీ కోడిగుడ్ల లభ్యం విషయంపై, సదరు అంగన్‌వాడీ టీచర్ కవితకు షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ రాజు బుధవారం తెలిపారు. కేసముద్రం మండలంలోని భుక్యా తండాకు చెందిన అంగన్‌వాడీ టీచర్ కవిత ఆ షోకాజ్ నోటీస్‌పై, 24 గంటలలో వివరణ ఇవ్వాలని, తదుపరి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శాఖాపరమైన చర్యలు ఉంటాయని ఆయన తెలిపారు.

రాష్ట్రస్థాయి అబాకస్‌లో విద్యార్థి ప్రతిభ



గార్ల: హైదరాబాద్‌లో జరిగిన అబాకస్ మ్యాథ్స్ పరీక్షలో గార్ల నిర్మలా హైస్కూల్‌లో చదువుతున్న 5వ తరగతి విద్యార్థి కాలా ఆరుష్ జైన్ అత్యంత ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో 3వ స్థానం సాధించాడు. పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జిన్సీ, ఉపాధ్యాయులు రవి, నరేష్, ప్రవీణ్ విద్యార్థిని అభినందించారు.

పాఠశాల సందర్శన

కురవి: సీరోలు మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల(ఈఎంఆర్ఎస్), కళాశాలను రాష్ట్ర ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ సెక్రటరీ సపావత్ వెంకన్న బుధవారం సందర్శించారు. మంగళవారం రాత్రి పాఠశాల, కళాశాల ఫేర్‌వెల్ కార్యక్రమం నిర్వహించగా నృత్యం చేస్తూ కుప్పకూలి విద్యార్థిని సపావత్ రోజా మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు రాష్ట్ర ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ సెక్రటరీ వెంకన్న బుధవారం పాఠశాలను సందర్శించారు. విద్యార్థినులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నాయి? అని అడిగి తెలుసుకున్నారు.

జాతరకు ఏర్పాట్లు చేయాలి

మహబూబాబాద్: మహా శివరాత్రి జాతరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆర్డీఓ కృష్ణవేణి అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మహాశివరాత్రి జాతర ఏర్పాట్లపై బుధవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 25 నుంచి వచ్చే నెల 12వరకు జరిగే జాతరకు సంబంధించిన అన్ని ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో చైర్మన్ రవీందర్‌రెడ్డి, ఈఓ సత్యనారాయణ పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



లచ్చమ్మ (ఫైల్)

కేసముద్రం: ఓ శతాధిక వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన నరేడ్ల లచ్చమ్మ(106) అనారోగ్యానికి గురై మృతి చెందింది. మృతురాలికి ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. 50 మందికి పైగా మనుమలు, మనుమరాళ్లు,ముని మనుమలు, ముని మనుమరాల్లు ఉన్నారు. కాగా అంత్యక్రియల్లో మనుమరాళ్లు పాడె మోశారు. పెద్ద కుమారుడు తలకొరివి పెట్టాడు.

కురవిలోనే కొనసాగించండి

కురవి: చింతపల్లి రెవెన్యూ గ్రామపరిధిలోని గ్రామాలన్నింటినీ పూర్వంలాగానే కురవి మండలంలోనే కొనసాగించాలని చింతపల్లి రెవెన్యూ గ్రామస్తులు బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో, జిల్లా కేంద్రంలోని జెడ్పీ సీఈఓ సంతోష్‌రావుకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో దొంగలి నర్సయ్య, రంగన్నగౌడ్, వెంకన్న, వీరన్న, బాలాజీ, మంగీలాల్ పాల్గొన్నారు.

జీతం ఇవ్వకుండా ఇబ్బందులు

కురవి: నాలుగు నెలలనుంచి జీతం ఇవ్వకుండా కురవి ఏపీఓ యాకాంబ్రం ఇబ్బందులు పెడుతున్నారని గుండ్రాతిమడుగు, బంగారు గూడెం, పెద్దతండా ఫీల్డ్‌అసిస్టెంట్ గాండ్ల నరేష్ ఆరోపించారు. బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఇట్టి విషయమై ఏపీఓను వివరణ కోరగా మూడు నెలల నుంచి వేతనాలు ఎవరికి రాలేదని, రెండు రోజుల్లో అందరికి వేతనాలు వస్తాయన్నారు.

బిల్లును రద్దు చేయాలి

నెల్లికుదురు: రాష్ట్ర ఉభయసభల్లో ఆమోదించిన ఎస్సీ వర్గీకరణ బిల్లును వెంటనే రద్దు చేసి, దళితుల ఐక్యత కోసం 20శాతం రిజర్వేషన్లను పెంచాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు చిట్టి మల్ల మహేష్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశాడు. బుధవారం ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు.

ఎమ్మెల్సీ పరామర్శ

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం గ్రామానికి చెందిన చుక్క శ్రీనివాస్ కుమారుడు డాక్టర్ శ్రీచరణ్ హైదరాబాదులో రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి తండ్రి శ్రీనివాస్‌తో మాట్లాడి ఓదార్చారు.

తెల్లబోయిన ఎర్రబంగారం

- నల్లతామర పురుగుతో దెబ్బతిన్న మిర్చి తోటలు
- గిట్టుబాటు ధర లేక నష్టపోతున్న రైతులు



పినిరెడ్డిగూడెంలో మిర్చిపంటను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు



మద్దతు ధర తగ్గడంతో మిర్చి తోటలో దిగాలుగా కూర్చున్న రైతులు

గార్ల: ఆరుకాలం కష్టపడి పండించిన మిర్చిపంటకు మద్దతు ధర లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో సుమారు రెండువేల ఎకరాల్లో రైతులు మిర్చిపంట సాగుచేశారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పండించిన మిర్చిపంట మార్కెట్‌లో వ్యాపారులు కుమ్మక్కై, క్వింటాకు రూ.12,000 తక్కువ ధరకు కొనుగోలు చేస్తుండటంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ఈ ఏడాది మిర్చితోటకు నల్లతామర పురుగు ఆశించడంతో తోటలకు పూత కాత రాక, పంటల్లో దిగుబడులు తగ్గాయని రైతులు దిగాలు చెందుతుండగా, మరోపక్క పండిన కొద్దిపాటి మిర్చి పంటకు సైతం గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. నల్లతామర పురుగు నివారణకు వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి ఎన్ని పురుగు మందులు పిచికారీ చేసినా నల్లి తెగులు తగ్గడంలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. మార్కెట్‌లో వ్యాపారులు దళారులుగా మారి మిర్చిపంటకు మద్దతుధర తగ్గించారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మిర్చి పంటకు వచ్చిన డబ్బులు, కూలీలకే సరిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే నేరుగా మిర్చి కొనుగోళ్లు నిర్వహించి రైతులకు క్వింటాకు రూ.25వేల మద్దతు ధర చెల్లించేలా చర్యలు చేపట్టి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

తీవ్రంగా నష్టపోయా,,



ఎకరం భూమిలో మిర్చితోట సాగు చేస్తుండగా, తోటకు నల్లిపురుగు ఆశించి పూత, కాత రాకుండా చేయడంతో తోట దెబ్బతిని పంట దిగుబడి తగ్గుతుంది. ఇక పండిన కొద్దిపాటి మిర్చికి ఈఏడాది గిట్టుబాటు ధర లేకపోవడంతో తీవ్రంగా నష్టపోయా. ప్రభుత్వమే నేరుగా మిర్చి కొనుగోలు చేయాలి.

\- గుగులోత్ చిన్నఈర్య, రైతు, గ్యామాతండా

మినీ జాతరకు సిద్ధమైన చింతలగట్టు



చింతలగట్టు సమ్మక్క గద్దెల వద్ద మండమెలిగె

గూడూరు: గూడూరు మీదుగా మహబూబాబాద్ వైపు జాతీయ రహదారి పక్కన దామరవంచ, జగన్నాయకులగూడెం జీపీల శివారు చింతలగట్టు వట్టివాగు ఒడ్డున వెలసిన సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద ఈనెల 12 నుంచి 15 వరకు నిర్వహించే మినీ జాతరకు నిర్వహణ, వడ్డెల కమిటీ ఏర్పాట్లు పూర్తి చేశారు. ములుగు జిల్లా పెద్ద మేడారం జాతరలో మాదిరిగానే చింతలగట్టులో జాతర వైభవంగా జరుగుతుంది. మండలంలోని చింతలగట్టు వట్టివాగు సమీప సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్ద బుధవారం మినీ జాతర ప్రారంభ సూచికంగా వనదేవతల గుడుల్లో శుద్ధి పండుగ నిర్వహించారు. ముందుగా జాతర ప్రదేశాన్ని మొత్తం శుభ్రం చేసి, మామిడి తోరణాలు కట్టారు. తహసీల్దార్ శ్వేత, డీటీ కోమల హాజరు కాగా, ఆలయ కమిటీ నిర్వాహకులు, వడ్డెలు వారితో తల్లుల గద్దెల వద్ద పసుపు, కుంకుమ పూజలు జరిపించారు. దూపదీప నైవేద్యాలతో యాట మొక్కులు చెల్లించుకున్నారు.

న్యాయవాదులపై దాడి హేయమైన చర్య



కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

తొర్రూరు: న్యాయవాదులపై దాడులు హేయమైన చర్య అని బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఘనపురం రామకృష్ణ అన్నారు. హన్మకొండలో న్యాయవాదిపై పోలీసుల దాడిని ఖండిస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం డివిజన్ కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో న్యాయవాదులు నిరసన తెలిపారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ.. న్యాయవాదులపై కక్షిదారులు, పోలీసుల దాడులు దురదృష్టకరమన్నారు. బాధితుల పక్షాన వాదించే న్యాయవాదులపై దాడులు అప్రజాస్వామికమన్నారు. దాడులను అరికట్టేందుకు న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలన్నారు. బార్ అసోసియేషన్ ప్రతినిధులు అలువాల శ్రీశైలం, నాగరాజు, బండపల్లి వెంకన్న, ప్రేమ్‌చందర్, ముకుందారావు, వల్లపు మధుసూదన్, మహేష్, యాకాంబ్రం, వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.

'విద్యుత్ అంతరాయం లేకుండా చూస్తాం'

మరిపెడ: వేసవికాలంలో విద్యుత్ సరఫరాలో ఏలాంటి అంతరాయం లేకుండా చూస్తామని విద్యుత్ శాఖ ఎస్ఈ నరేష్ అన్నారు. మరిపెడలో బుధవారం మండలకేంద్రంలో విద్యుత్ సమస్య పరిష్కార వేదికలో ఆయన పాల్గొని మాట్లాడారు. డివిజన్ పరిధిలో ఫిర్యాదులు స్వీకరించారు. పట్టణంలో నాణ్యమైన విద్యుత్ పరిశ్రమలకు, వినియోగదారులకు అందించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ క్షేత్రాలకు సంబంధించి మరమ్మతులను ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, కొత్తలైన్ల పునరుద్దరణను పరిశీలించాలని చెప్పారు. జేఎల్ఎంలు, విద్యుత్ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, విద్యుత్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం



మహబూబాబాద్: నిరసన తెలుపుతున్న నాయకులు

గూడూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కొమ్మాలునాయక్, మండల అధ్యక్షుడు చిట్టి వెంకన్న అన్నారు. మండల కేంద్రంలో బుధవారం వారు మాట్లాడారు. ఎమ్మెల్యే మురళీనాయక్ సీఆర్ఆర్ గ్రాంట్ కింద మండలానికి రూ. 2కోట్ల 50లక్షలు మంజూరు చేసినందుకు ప్రజల పక్షాన వారు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీపాల్‌రెడ్డి, మధుగౌడ్, యాకయ్య, రసూల్, రవిసింగ్ రాథోడ్, మంగీలాల్, బాలూనాయక్, శ్రీను, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మహబూబాబాద్: కేంద్ర బడ్జెట్ రైతు ప్రజావ్యతిరేకంగా, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉందని సంయుక్త కిసాన్ మోర్చా ఎస్‌కేఎం నాయకులు చిన్న చంద్రన్న, వెంకటేశ్వర్లు, సుధాకర్, మేక వీరన్న, కోటేష్, నాగన్న ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. కార్యక్రమంలో దేవేందర్, వెంకన్న, సూర్యం, మదార్, తాజ్ పాషా పాల్గొన్నారు.

పేదలకు మేలు చేయని బడ్జెట్

దోర్నకల్: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో పేదలకు ఎలాంటి మేలు జరగలేదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శెట్టి వెంకన్న తెలిపారు. కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా స్థానిక గాంధీసెంటర్‌లో పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు బొబ్బ వెంకటరెడ్డి, శ్రీనివాస్, బొమ్మెన అశోక్‌కుమార్, నవాబ్, జె.వెంకటేశ్వర్లు, పుట్టా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ధరల నిర్ణయంలో పూర్తి సహకారం



మాట్లాడుతున్న సుధాకర్‌నాయక్

మహబూబాబాద్ రూరల్: వ్యవసాయం మార్కెట్‌కు రైతులు తీసుకువచ్చే సరుకుల క్రయవిక్రయాలు, ధరల నిర్ణయం విషయంలో పూర్తి సహకారం అందిస్తామని మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ నాయక్ అన్నారు. వ్యాపారులు, కార్మిక సంఘాల నాయకులతో వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. మార్కెట్‌లో ధాన్యం, పత్తి, మక్కలు, అపరాల కొనుగోళ్ల అనంతరం బస్తాలు నింపే ధరల చెల్లింపుపై కూలీలకు ఇస్తున్న మొత్తాన్ని పెంపుదల చేసే విషయంపై నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. గతంలో బస్తాకు రూ.6చొప్పున చెల్లిస్తుండగా ఆ మొత్తాన్ని రెండింతలుగా రెట్టింపు చేసి ఒక బస్తాకు రూ.12 చెల్లించే విధంగా తీర్మానించామన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ మదన్ గోపాల్ లోయ, ఏఎంసీ డైరెక్టర్లు జంగాల నరసింహారావు, ఏకాంబరం, కార్మిక సంఘం నాయకులు నాగన్న, సుధాకర్, వెంకన్న పాల్గొన్నారు.

కరాటేలో గోల్డ్‌మెడల్

మహబూబాబాద్ అర్బన్: ఈనెల 2న ముంబాయిలో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే ఛాంపియన్‌షిప్‌లో విద్యార్థి తేజావత్ శివరాం గోల్డ్‌మెడల్ సాధించారని ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం భూక్య సిరినాయక్ తెలిపారు. బుధవారం విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.

చికిత్స పొందుతున్న విద్యార్థి మృతి

మహబూబాబాద్ రూరల్: మంచిగా చదువుకోవాలని, బడికి వెళ్లాలని ఓ తల్లి మందలించగా పురుగుల మందు తాగి విద్యార్థి ఆత్మహత్యయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని దర్గా తండా జీపీ పరిధిలో గల రేగడి గూడెంలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై వి.దీపిక బుధవారం కేసు వివరాలను వెల్లడించారు.మండలంలోని దర్గాతండా గ్రామపంచాయతీ పరిధిలో గల రేగడి గూడెంకు చెందిన కారం అర్జున్, లక్ష్మీ దంపతుల ఏకైక కుమారుడు బద్రినాథ్ (13) ఈదులపూసపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. బడికి వెళ్లమని తల్లి మందలించింది. దీంతో విద్యార్థి ఈనెల ఒకటో తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా అక్కడే చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి తండ్రి అర్జున్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



సదస్సులో మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

గార్ల: మామిడితోటల్లో రైతులు సరైన సమయంలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా మామిడి పంటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చని కొండా లక్ష్మణ్ ఉద్యాన పరిశోధన స్థానం ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్‌కుమార్ సూచించారు. బుధవారం మండలంలోని సీతంపేట గ్రామంలోని మామిడితోటలో కేవీకే మల్యాల ఆధ్వర్యంలో నిర్వహించిన మామిడి రైతుల సదస్సులో ఆయన మామిడి తోటల్లో చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో కేవీకే మల్యాల కోఆర్డినేటర్ డాక్టర్ మాలతి, జిల్లా ఉద్యాన అధికారి మరియన్న, శాస్త్రవేత్త రాంబాబు, ఏఓ కావటి రామారావు, హెచ్ఓ శాంతిప్రియ, ప్రియదర్శిని, గ్రీన్ ఇండియా ఎండి రమేష్, రైతులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన



ప్రహరీపై వేసిన జంతువుల చిత్రాలు

గూడూరు: వన్యప్రాణులను సంరక్షించడం, వాటి పరిరక్షణ అటవీ శాఖ ఉద్యోగులతోపాటు ప్రజలందరిదని ఎఫ్ఆర్వో సురేష్ అన్నారు. మండల కేంద్రంలోని ఫారెస్టు రేంజ్ కార్యాలయం వద్ద బుధవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం వన్యప్రాణుల సంరక్షణ కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసిందన్నారు. అందులో భాగంగా జిల్లా ఉన్నతాధికారుల ఆదేశం మేరకు వన్యప్రాణుల సంరక్షణ అటవీశాఖ అధికారులు, సిబ్బందితో పాటు ప్రజలకు బాధ్యత ఉండేలా అవగాహణ కల్పించడం కోసం ముందుగా స్థానిక అటవీ శాఖ కార్యాలయం ప్రహరీ గోడలపై జంతువుల చిత్రాలను వేయిస్తున్నామని తెలిపారు. తద్వారా ప్రజలకు అటవీ జంతువుల రక్షణపై అవగాహన పెరుగుతుందన్నారు.

సంక్షిప్త సమాచారం

అవకాశాలను వినియోగించుకోవాలి

బయ్యారం: ఎస్టీ విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం కల్పిస్తున్న పలు అవకాశాలను వినియోగించుకొని అభివృద్ధి చెందాలని ఇర్సులాపురం ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం కోటయ్య పిలుపునిచ్చారు. మండలంలోని ఇర్సులాపురం ఆశ్రమ పాఠశాలలో హైదరాబాద్‌కు చెందిన ఎన్‌జీఓ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాయ్స్ ఫర్ చేంజ్ శిక్షణా శిబిరంను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ శిబిరంలో సంస్థ ప్రతినిధులు ఓంకార్ మినియర్, మనోజ్‌కుమార్, శివకుమార్, విశాల్‌రమాకాంత్, అనూష భరద్వాజ్ పాల్గొన్నారు.

పశుసంపద అభివృద్ధికి కృషి

మహబూబాబాద్ రూరల్: పశుసంపద అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని పశువైద్య అధికారి డాక్టర్ నాళ్ల అశోక్ అన్నారు. మండలంలోని మీఎస్.లక్ష్మీపురం గ్రామంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం, దూడల ప్రదర్శన బుధవారం నిర్వహించారు. శిబిరంలో ఏరియా గోపాలమిత్ర సూపర్‌వైజర్ కరిమిళ్ల రఘువీర్, గోపాలమిత్రలు పేర్ల శంకర్, పిట్టల కృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

బయ్యారం: జిల్లా కేంద్రంలో నేడు నిర్వహించనున్న టీజీ టీటీఎఫ్ జిల్లాస్థాయి సమావేశంను జయప్రదం చేయాలని సంఘం జిల్లా నాయకులు రూప్లానాయక్ పిలుపునిచ్చారు. బుధవారం బయ్యారంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

దోర్నకల్: స్థానిక బ్యాంక్‌స్ట్రీట్‌లోని వేంకటేశ్వరాలయంలో బుధవారం పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి 18వ బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆరురోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలలో మొదటి రోజు ఉత్సవారంభ అభిషేకాలు నిర్వహించారు.

తునికాకు కట్టకు రూ.6చెల్లించాలి

నెహ్రూసెంటర్: ప్రభుత్వం తునికాకు సేకరణకు కాంట్రాక్టర్లను ఆహ్వానించి టెండర్లు వేసి వెంటనే పూనింగ్ పనులు చేపట్టాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్ బుధవారం డిమాండ్ చేశాడు. 50ఆకులతో కూడిన తునికాకు కట్టకు రూ.6చెల్లించాలన్నారు.

పాఠశాల తనిఖీ

మహబూబాబాద్ రూరల్: ఉపాధ్యాయులు ఉత్తమ విద్యాబోధనతో విద్యార్థులు విద్యలో రాణించే విధంగా కృషి చేయాలని ఎంఈఓ ఎస్.వెంకటేశ్వర్ రావు అన్నారు. మండలంలోని మల్యాల ఎంపీ యూపీఎస్ పాఠశాలను బుధవారం ఎంఈఓ ఉదయం ప్రార్థన సమయంలో తనిఖీ చేశారు.

సబ్సిడీ ట్రాక్టర్ ఇప్పిస్తానని మోసం

కురవి: సబ్సిడీ ట్రాక్టర్ ఇప్పిస్తానని మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజి) ఏఈఓ బానోత్ కల్యాణ్(సస్పెన్షన్‌కు గురైన వ్యక్తి) రూ.5లక్షలు తీసుకుని మోసం చేశాడని సీరోలు మండలం కొత్తూరు (సీ) గ్రామానికి చెందిన కిరాణ షాపు యజమాని కొండ్లె సీతరాములు బుధవారం కలెక్టర్‌కు, డీఏఓకు ఫిర్యాదు చేశాడు. 50శాతం సబ్సిడీ ట్రాక్టర్ ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి రూ.5లక్షలు తీసుకున్నాడని పేర్కొన్నాడు. సబ్సిడీ ట్రాక్టర్ ఇవ్వకపోగా తీసుకున్న డబ్బులు సైతం ఇవ్వలేదని పేర్కొన్నారు.

నల్లబెల్లం పట్టివేత

దంతాలపల్లి: దంతాలపల్లి మండలంలో పలు గ్రామాలతో పాటు, నర్సింహులపేట మండలంలోని పెద్దనాగారం, పనుమటిగూడెంలో ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించినట్లు ఎస్సై రవళిరెడ్డి బుధవారం తెలిపారు. 800కిలోల నల్లబెల్లం, 100కిలోల పటిక తరలిస్తున్న ఓ కారును, ద్విచక్రవాహనం, పనుమటి గూడెం క్రాస్ రోడ్డు దగ్గర పట్టుకున్నట్లు తెలిపారు. వాహనాలను సీజ్ చేసి ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు.

టీపీసీసీ సాంస్కృతిక సేన కార్యవర్గం ఎన్నిక

మహబూబాబాద్ రూరల్: టీపీసీసీ సాంస్కృతిక సేన జిల్లా నూతన కమిటీ అధ్యక్షుడిగా పగిడిపాల వెంకట్రావును ఎన్నుకోగా, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి బుధవారం నియామకపత్రం అందజేశారు.

దళితులను విచ్ఛిన్నం చేసేందుకే వర్గీకరణ

నెహ్రూసెంటర్: రాజ్యాంగాన్ని మార్చే కుట్రలో భాగంగానే దళితులను విచ్ఛిన్నం చేసేందుకు ఎస్సీ వర్గీకరణ తెరమీదకి తీసుకొచ్చిందని మాల మహానాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిట్టిమళ్ల మహేష్, బెజ్జం ప్రేమ్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో యాకాంతం, కారం ప్రశాంత్, మద్దెల రమేష్, బాణాల సంజీవ, పగిడిపల్లి రాములు, అశోద ప్రవీణ్ పాల్గొన్నారు.

క్షీరాభిషేకం

మహబూబాబాద్ రూరల్: ఎస్సీ వర్గీకరణ సంచార జాతుల బేడ బుడగజంగాల కులానికి అభివృద్ధికి నాంది అని టీపీసీసీ ఓబీసీ సెల్ స్టేట్ కో ఆర్డినేటర్ ఎస్సీ పింఢ్రాల రామదాసు అన్నారు. ఎస్సీ వర్గీకరణను అసెంబ్లీ సాక్షిగా ఆమోదించిన శుభ సందర్భంగా జిల్లా కేంద్రంలోని బేడ బుడగ జంగాల కాలనీలో సీఎం చిత్రపటానికి బుధవారం క్షీరాభిషేకం చేశారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా వీరబాబు

మరిపెడ: ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడిగా బాషిపంగు వీరబాబును నియమించినట్లు సంఘం మండల అధ్యక్షుడు అయినాల వెంకన్న బుధవారం తెలిపాడు. ఉపాధ్యక్షుడు సోమారపు రమేష్, కార్యదర్శి బాషిపంగు సునీల్, సహాయ కార్యదర్శి జినుక సతీష్, కోశాధికారి ఎడెల్లి వెంకటేశ్, సహాయకోశాధికారి బాషిపంగు విజయ్‌లను ఎన్నుకున్నారు. గౌరవ సభ్యులులను నియమించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కేసముద్రం: కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగిన ఓ వ్యక్తి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఇనుగుర్తి మండలంలోని మూలస్తంభంతండాలో చోటుచేసుకుంది. ఎస్సై మురళీధర్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన గుగులోతు సురేష్(39) అనే వ్యక్తి, జనవరి 28న కుటుంబ కలహాల కారణంగా పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, అతడిని మానుకోటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మానుకోట జనరల్ ఆస్పత్రిలో చేర్పించగా, మంగళవారం సాయంత్రం పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుడి తల్లి కౌంసీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

తొర్రూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు అన్నారు. డివిజన్ కేంద్రంలో బుధవారం ఎస్ఎఫ్ఐ మండల మహాసభ నిర్వహించారు. సంఘ నూతన మండల అధ్యక్షుడిగా నరసింహ, కార్యదర్శిగా సుమంత్‌లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘ మాజీ నాయకులు బొల్లం అశోక్, కొమ్మనబోయిన యాకన్న, తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 50శాతం రిజర్వేషన్ కల్పించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

మహబూబాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు యాభైశాతం రిజర్వేషన్ కల్పించే చట్టం చేసి వెంటనే అమలు చేయాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుగు కుమార్ డిమాండ్ చేశారు. బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేసి అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మచారికి వినతపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా పెరుగుకుమార్ మాట్లాడుతూ.. అన్నిరంగాల్లో బీసీలు వెనుకబడి ఉన్నారన్నారు. దేశగణనలో కులగణన చేయాలని డిమాండ్ చేశారు. బడ్జెట్ పార్లమెంట్ సమావేశాలలో బీసీలకు యాభైశాతం చట్టసభలో రిజర్వేషన్ బిల్లు ప్రవేశ పెట్టి అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో వెలుగు శ్రావణ్, ప్రవీణ్, శ్రీనాథ్, రమేష్, హర్షవర్ధన్, వికాస్ పాల్గొన్నారు.

బాలికలు అన్నిరంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న హెచ్చెం నర్సయ్య

మహబూబాబాద్ అర్బన్: బాలికలు మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా దృఢంగా ఉన్నప్పుడే అన్నిరంగాల్లో విజయాలు సాధించవచ్చని గిరిజన ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం పాడుగు నర్సయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో బుధవారం విద్యార్థినులకు వాయిస్ ఫర్ గర్ల్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. బాలికలు చదువుతోపాటు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, చిట్టిబాబు, జయమ్మ, జమున, వీరస్వామి, రవీందర్, హనుమంతు, దేవేందర్, శ్రీనివాస్, కోఆర్డినేటర్లు శ్రీనిత్య, హర్షిత, వనజ, అక్షిత, తదితరులు పాల్గొన్నారు.

కెపాసిటర్లను అమర్చుకోవాలి

కేసముద్రం: విద్యుత్ మోటార్‌లకు కెపాసిటర్‌లను అమర్చుకోవాలని విద్యుత్ శాఖ డీఈ విజయ్ రైతులకు సూచించారు. బుధవారం ఇనుగుర్తి మండల కేంద్రంలోని శివ అనే రైతు వ్యవసాయ క్షేత్రంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో రైతు పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈ రాజు, ఏడీ ప్రశాంత్, ఏఈ రాజు, లైన్ ఇన్‌స్పెక్టర్ రవి పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

నర్సింహులపేట: మండలంలోని జయపురం గ్రామంలో ఈనెల 14వ తేదీన శ్రీసీతారామస్వామి కల్యాణం సందర్భంగా గుడికి రంగులు వేయడానికి దళితులకు అనుమతి లేదని చెప్పడంతో బుధవారం నిరసన వ్యక్తం చేస్తు గ్రామంలోని దళితులు కేవీపీఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో హరీశ్, రవి, వెంకన్న, ప్రసాద్ శ్రీపాల్ పాల్గొన్నారు.